మిచాంగ్ బాధితులకు నష్ట పరిహారం

- 4,548 మంది రైతులకు లబ్ధి
- వారి బ్యాంకు ఖాతాలకు రూ.4.09 కోట్ల జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

అల్లవరం: గతేడాది ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులను మిచాంగ్ తుఫాన్ కోలుకోలేని దెబ్బ తీసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఒబ్బిడి చేసుకునే లోపు మిచాంగ్ తుఫాన్ తీవ్ర నష్టాలను మిగిల్చింది. తుఫాన్ ప్రభావంతో గతేడాది డిసెంబర్ 2వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షాలకు పంట ముంపు బారిన పడింది. అమలాపురం నియోజకవర్గం వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి పంట ముంపు బారిన పడింది. అల్లవరం మండలంలో 1,344 ఎకరాలు, అమలాపురం రూరల్ పరిధిలో 3,004 ఎకరాలు, ఉప్పలగుప్తం మండలంలో 1,564 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వ్యవసాయంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టింది. రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చి గ్రామస్థాయిలోనే రైతులకు సకల సేవలు అందేలా చర్యలు చేపట్టింది. అంతేకాదు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రాయితీ అందించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు సైతం రైతులకు అండగా నిలుస్తుంది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికలకు ముందే నష్ట పరిహారాన్ని విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నష్ట పరిహారం సొమ్మును రైతుల బ్యాంక్ ఖాతాలకు మళ్లించడంలో జాప్యం జరిగింది. ఎన్నికల అనంతరం అమలాపురం నియోజకవర్గ పరిధిలోని అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం మండలాల్లో 5,812 ఎకరాల్లో పంట నష్టపోయిన 4,548 మంది రైతులకు రూ.4.09 కోట్ల నిధులను డీబీటీ విధానంలో వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నారు.



మిచాంగ్ తుపాన్‌తో ముంపుబారిన పడిన వరి చేలు (ఫైల్)



ముంపు బారిన పడిన వరి చేలను పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా(ఫైల్)

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నేను మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. గతేడాది డిసెంబర్లో మిచాంగ్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసి నా పంటంతా నీట మునిగింది. ముంపు నీరు దిగక పంట చేతికందే అవకాశం లేకుండా పోయింది. దీంతో వ్యవసాయాధికారులు పరిశీలించి నష్టం జరిగినట్లుగా నిర్ధారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేసిన నష్ట పరిహారం నిధులు రూ.20,400 నా బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. రైతులను ఆదుకున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– బొంతు మోహన్‌దాస్, రైతు, అల్లవరం

రైతుకు మంచి రోజులు



నేను ఆరు ఎకరాల్లో కౌలు సాగు చేస్తున్నాను. డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వరి పంట నీట మునిగింది. వ్యవసాయాధికారులు మునిగిన పంటను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పంట పరిహారం నిధులు రూ.8 వేలు బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. ప్రభుత్వం ఆపదలో ఆదుకోవడం చూస్తుంటే రైతుకి మంచి రోజులు వచ్చాయని అర్థమవుతుంది.

– చిక్కం బంగారునాయుడు, రైతు, ఉప్పలగుప్తం

చిన్నారులకు పౌష్టికాహార కిట్ల అందజేత

అమలాపురం రూరల్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో దీప్తి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ చిన్నారులకు ఉచిత పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ ఎసెట్ ఫండ్ సహకారంతో సమకూర్చిన కిట్లను సర్పంచ్ కడిమి చిన్నమరాజు, దీప్తి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు ఎంపీ బాలామణి, ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఏవీ రామరాజు తదితరుల చేతుల మీదుగా చిన్నారులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్‌జీ సభ్యుడు వెంకట్, ధనలక్ష్మి, ఏడుకొండలు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ఎయిడ్స్ బారిన పడి మృతి చెందిన వారికి ఆత్మ శాంతిని కోరుతూ స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డేను పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ, జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్, పలు స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భారతలక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, రామరాజు, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ యేసేబు, సునీల్‌కుమార్, జనకల్యాణ్ ప్రతినిధి జి.శ్రీను పాల్గొన్నారు.

సినీ సాహితీ శిఖరం సిరివెన్నెల

అమలాపురం టౌన్: సిరివెన్నెల సీతారామశాస్త్రి సినీ సాహితీ శిఖరమని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ బజార్‌లోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సీతారామశాస్త్రి జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి సిరివెన్నెల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, గ్రంథాలయ నిర్వాహకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, విశ్రాంత ఎంఈఓ కోటిపల్లి సత్యనారాయణ, సాహితీ అభిమాని చిక్కాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సిరివెన్నెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాహితీ అభిమానులు

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



పిల్లంక ఇసుక ర్యాంపులో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ జె.నివాస్



గోవలంక ఇసుక ర్యాంపులోకి వాహనాలు వెళ్లకుండా జేసీబీతో తవ్విన దృశ్యం

- కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ హెచ్చరిక
- ఇసుక ర్యాంపుల ఆకస్మిక తనిఖీ

తాళ్లరేవు: గోదావరిలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ జె.నివాస్, ఆర్డీఓ ఇట్ల కిషోర్, డీఎస్పీ హనుమంతు, ఎస్ఈబీ ఏఎస్పీ రవి కుమార్ తదితర అధికారుల బృందం మండల పరిధిలోని పిల్లంక, గోవలంక ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఇసుక ర్యాంపులలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో ఆంధ్రా ప్రాంతం నుంచి ఇసుకను యానాం తరలిస్తున్నారని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఇసుక రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్, ఎస్ఈబీ, గనుల శాఖల అధికారులను ఆదేశించారు. మండల అధికారులు సైతం అప్రమత్తంగా ఉండాలని, ర్యాంపులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ర్యాంపుల్లో ఎటువంటి రవాణా జరక్కుండా చూడాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక అక్రమ మైనింగ్, రవాణా నిరోధించేందుకు సీసీ టీవీలను ఏర్పాటు చేసి సిబ్బందితో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ర్యాంపుల్లోకి ఎటువంటి వాహనాలు వెళ్లకుండా రహదారులను జేసీబీలతో తవ్వించారు. ఎస్ఈబీ ఏఎస్పీ జె.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, గనుల శాఖ డీడీ నరసింహారెడ్డి, భూగర్భ జలాల అధికారి పి.రాధాకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సందీప్‌రెడ్డి, సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు 64 మంది ఎంపిక

ఆలమూరు: అర్హులైన పేద విద్యార్థుల కార్పొరేట్ విద్యలో భాగంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల ల నుంచి 64 మంది ఎంపికయ్యారు. వీరిలో ప్రస్తుతం 40 మంది కార్పొస్కూళ్లలో చేరినట్లు ఎంఈఓ తెలిపారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల విస్తరణకు కార్యాచరణ

మామిడికుదురు: కొబ్బరి ఆధారిత పరిశ్రమలను విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టామని మామిడికుదురు నారియల్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎండీ నయినాల వేణుగోపాల్ తెలిపారు. మామిడికుదురులోని సంస్థ కార్యాలయంలో సోమవారం యువ, మహిళా పారిశ్రామిక వేత్తల అవగాహన, ఉద్యోగ ఆధార్ మేళా జరిగింది. పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ మాట్లాడుతూ కొబ్బరి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ దిశగా రైతుల్లో చైతన్యం తీసుకు వస్తున్నామన్నారు. పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ప్రొడ్యూసర్ కంపెనీగా ఏర్పడే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కొబ్బరి పరిశ్రమలను విస్తరించే అంశంపై ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్, కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో తాను చర్చించానని ప్రొడ్యూసర్ కంపెనీ ఎండీ చెప్పారు. నారియల్ కంపెనీ పరిధిలో కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీ కొరకు అవసరమైన కామన్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన రెండెకరాల భూమితో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరానన్నారు. సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎ.మాధురి, రైతులు యెరుబండి లక్ష్మయ్య, మట్టపర్తి రెడ్డి, మసూద్ మొహిద్దీన్, గెద్దం రాంబాబు, పల్లి ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న కంపెనీ ఎండీ వేణుగోపాల్

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

అంబాజీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి వ్యక్తి మృతి చెందినట్లు అంబాజీపేట పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం పోతవరం ప్రభలదిబ్బకు చెందిన కాప లోవరాజు (31) ఈ నెల 14న అంబాజీపేటలో తన మేనకోడలు ఇంటికి వచ్చాడు. అనంతరం పురుగుమందు తాగడంతో అతడిని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు కాప దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: స్థానిక డీసీసీ బ్యాంకు ఎదురుగా సోమవారం జరిగి రోడ్డు ప్రమాదంలో స్కూటీ, మోటారు సైకిళ్ల ఢీ కొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానికుడు గోళ్ల కృష్ణ తన ఇంటి వద్ద నుంచి స్కూటీపై అంబాజీపేట సెంటర్‌కు వస్తున్నాడు. అదే సమయంలో ముంగండ నుంచి అమలాపురం వైపు పల్సర్ బైక్‌పై వెళుతున్న పితాని సాయికుమార్, బొక్కా నరేష్‌లు స్కూటీని బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, బంధువులు అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అతి వేగం, అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సాయికుమార్, నరేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

మలేరియా నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సంధిపూడిలో రోగిని పరీక్షిస్తున్న సాయికిషోర్

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత సీజన్‌లో సంభవించే మలేరియా జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులోని మూడు గ్రామ సచివాలయ పరిధిలో ఇటుక బట్టీ కార్మికుల కుటుంబాలను సందర్శించారు. ఈసందర్భంగా పరీక్షలు నిర్వహించి మలేరియా వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే సంధిపూడిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారి డి.సాయికిషోర్ సుమారు 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఎంపీహెచ్ఎస్ ముద్రగడ శ్రీనివాసరావు, వైద్యారోగ్య సిబ్బంది కె.సుమాంజలి, భాను, శ్వేత, కె.విజయలక్ష్మి, ఎస్.సంధ్యారాణి, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

అంబాజీపేట: విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యార్థులు గ్రంథాయాలను ప్రతినిత్యం వినియోగించుకోవాలని గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో చిన్నారులు పుస్తక పఠనం సోమవారం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న చరిత్ర పుస్తకాలను, కథలను చదివడం వల్ల విజ్ఞానం పొందుతారన్నారు. వీటితో పాటు విద్యకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 వరకూ గడువు పొడిగింపు

యానాం: పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ కోర్సులు, పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈనెల 26 వరకూ పొడిగించినట్లు వర్సిటీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు పీఓఎన్‌డీఐయూఎన్ఐ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే సీయూఈటీ-2024 నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో వచ్చిన స్కోరు, ర్యాంకు ఆధారంగా అర్హతలను బట్టి అడ్మిషన్లు నిర్వహించనున్నారు.

మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా మాదక ద్రవ్యాల విక్రయాలను నిరోధించేలా పాఠశాలలు, కళాశాలల పరిసరాలపై పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఏఐఏడీఎంకే పార్టీ కార్యదర్శి ఎ.అన్బళగన్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను అరికట్టడంలో సీఎం రంగసామి జోక్యం చేసుకోవాలన్నారు. పుదుచ్చేరివ్యాప్తంగా అనేక కొత్త రకాల నిషేధిత పొగాకు ఉత్పత్తులు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. అనంతరం ఆయన తమ పార్టీ నేతలతో కలిసి నిషేధిత పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లను సీఎం రంగసామికి అందజేశారు. చిన్న చిన్న దుకాణాల్లో కొత్త రకాల ఉత్పత్తులు లభిస్తున్నాయని, గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



బండారులంకలో అవగాహన కల్పిస్తున్న అమలాపురం తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు

అమలాపురం రూరల్: ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు హెచ్చరించారు. భట్నవిల్లి, బండారులంక గ్రామాల ప్రజలకు ఆదివారం రాత్రి ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే ప్రకటనలు, కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఎలక్షన్ కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించేలా తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం చేసినా చర్యలు తప్పవన్నారు.

అంబాజీపేటలో పదో తరగతి సప్లిమెంటరీ సెంటర్

అంబాజీపేట: ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని అంబాజీపేట హైస్కూల్‌కు ప్రభుత్వం మంజూరు చేసినట్లు హెచ్ఎం కడలి సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ అంబాజీపేట పి.గన్నవరం మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు 30 హైస్కూళ్లకు సంబంధించి అంబాజీపేట హైస్కూల్ సెంటర్‌గా మంజూరు చేసిందన్నారు. గరిష్ఠంగా 183 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్‌పై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకం ఉండాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరగనున్నాయన్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

రోగికి ఆర్థిక సాయం



దుర్గాప్రసాద్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ

మలికిపురం: గన్నవరం గ్రామానికి చెందిన డొక్కు దుర్గాప్రసాద్ అనే వ్యక్తికి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. అతడికి ఆర్థిక ఇబ్బందుల వల్ల రాజోలు నియోజకవర్గం శ్రీకృష్ణ యాదవ సంఘాన్ని ఆశ్రయించారు. సంఘం సమకూర్చిన ఆర్థిక సాయాన్ని అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ చేతుల మీదుగా ఆయనకి సోమవారం అందజేశారు. లక్కవరం శ్రీకృష్ణ ఆలయం వద్ద ఆయనకి రూ.15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రెసిడెంట్ మట్టా వెంకట రామకృష్ణ ప్రధాన కార్యదర్శి నూనె రామకృష్ణ మలికిపురం మండలం అధ్యక్షుడు సూరిమేను రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ గుండుబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

27న అమ్మవార్ల జాతర

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర మహోత్సవం ఈ నెల 27వ తేదీ సోమవారం జరుగుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. మూడు రోజుల పాటు జరిగే జాతర మహోత్సవాల్లో భాగంగా 28వ తేదీ మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు చెల్లిస్తారని, 29వ తేదీ బుధవారం అమ్మవార్ల తీర్థ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



గోడితిప్పలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, పాఠశాల ప్రహరీ పనులను పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. గోడితిప్ప, తుమ్మలపల్లి, గోడిలంక గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని, నిర్మాణ లోపాలు ఉండకూడదని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ రోడ్లకు ఇరువైపులా బెర్ములు నిర్మించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవిరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దిలీప్, రోజా, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత సూర్యప్రసాద్ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారి అన్నదాన ట్రస్ట్ నిమిత్తం కాకినాడకు చెందిన వి.సూర్యప్రసాద్ రూ.10 వేలను ఆలయ సిబ్బందికి సోమవారం అందజేశారు. దాత సూర్యప్రసాద్ కుటుంబ సభ్యులకు అర్చకులు ప్రత్యేక దర్శనం అందించి అనంతరం ఆలయ మర్యాదలతో శేషవస్త్రం, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అన్నదాన ట్రస్ట్‌కు 80జీ వర్తింపు ఉన్నందున విరివిగా విరాళాలు అందివ్వాలని కోరారు.

ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధుల రక్తదానం

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం రక్త దానం చేశారు. మాజీ ఐఆర్ఎస్ అధికారి టీఎస్ఎన్ మూర్తి పుట్టిన రోజు సందర్భంగా ఫౌండేషన్ తరపున వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదానంతో పాటు స్థానిక కామాక్షీ పీఠంలోని ప్రేమ మందిరం అనాథ పిల్లలకు, హరి మనో వికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులకు పండ్లు పంచి పెట్టారు. సేవా కార్యక్రమాల్లో ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ, టేకి సత్యకుమార్, కృపావరం, న్యాయవాది తాళ్ల సాంబమూర్తి, నాతి శ్రీను, జల్లి శ్రీను, బొక్కా నాని తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

రోడ్డు చెంతనే పొగ.. ఆరోగ్యానికి సెగ



భీమనపల్లిలో చెత్తకు నిప్పంటించడంతో కమ్ముకున్న పొగ



ఉప్పలగుప్తంలో రోడ్డు పక్కనే తగులబెట్టిన చెత్త

ఉప్పలగుప్తం: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ అధికారులు రోడ్డు చెంతనే చెత్తను తగలబెట్టడంతో పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మేజర్ పంచాయతీలైన భీమనపల్లి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తంల్లో తరచుగా ఈ పరిస్థితి ఉంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ప్రధాన రహదారుల పక్కన నివాసాలకు చేరువలో కాలుస్తుండడంతో పరిసర ప్రాంతమంతా పొగ కమ్ముకుని ప్రజలు, అటుగా ప్రయాణించే వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లున్నా వాటిని కేవలం పైఅధికారులు వచ్చినప్పుడు ఆడిట్‌లకు మాత్రమే ఉపయోగించి మిగతా సమయాల్లో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.